# కొన్ని విద్యలు ఆడవాళ్ళకి పెళ్ళివరకే పరిమితమా?

"అదేం శాపమోగానీ ఎంతనేర్చినా ఎంత సాధించినా కొన్ని విద్యలు వివాహం వరకే పరిమితమైపోతున్నాయి ఆడవాళ్ళకి!" విసుక్కుంటూ ఉత్తరాన్ని మడిచి టేబుల్ మీద పెట్టింది భావన!

"ఏం జరిగిందేమిటి?" ప్రశ్నించాడు సుమన్ ఆ ఉత్తరం మందాకిని దగ్గరనుంచి వచ్చిందని తెలిసి.

'ఏముంది! మీ మొగాళ్ళంతా ఇంతే! పెళ్ళి కాకముందు రంభవీ, ఊర్వశివీ అంటూ పొగిడేవాళ్లు, పెళ్లయిపోగానే మారిపోతారు' అంది కోపంగా భావన.

భావనా, మందాకిని క్లోజ్ ఫ్రెండ్స్! ఇంటర్ నుంచి బియ్యేవరకూ కలిసి చదువుకున్నారు. కలిసి అల్లరి చేసారు. కలిసి కబుర్లు చెప్పుకున్నారు. భావనకి తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధమే సుమన్‌తో పెళ్ళయింది. మందాకినిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు సూర్య.

భావన, మందాకిని కాలేజీకి వెళ్ళింది మొదలు ఇంటికొచ్చేదాకా కలిసే వున్నా, ఇరువురూ విడిపోయే సమయం వారంలో రెండుసార్లు. మందాకినికి నాట్యం అంటే మహాప్రీతి. ప్రీతికన్నా స్ట్రాంగ్ పదం వాడాలీ అంటే పిచ్చి అనొచ్చేమో!

భావన ఫ్రెంచి క్లాసెస్‌కి వెళ్లేది.

"మందాకినీ ఇంత పిచ్చేమిటే నాట్యం అంటే! తిండీ తిప్పలు లేకుండా పోయినా సరే కాలేజీ క్లాసులు ఎగ్గొట్టయినాసరే రాత్రి పొద్దుపోయేవరకు జరిగి ఒంటరిగా వెళ్లాల్సిన పరిస్థితి అయినా సరే. కిమ్మనకుండా వుంటావు. మరి పెళ్ళయ్యాక నాట్యం వాళ్ళకి నచ్చకపోతే!" అడిగింది భావన.

"నో..నో..నో అలా జరగదు. నేను చేసుకోబోయే అతనిని ముందే

అడుగుతాను నాతోపాటు నాకిష్టమయిన నాట్యాన్నీ ప్రేమిస్తేనే పెళ్ళి చేసుకుంటానని! లేకపోతే లేదని!" పకపకా నవ్వింది మందాకిని.

"అంత ధయిర్యం వుందన్నమాట!" నవ్వింది భావన.

ఆ తరవాత కొన్ని రోజులకే మందాకిని ఇస్తున్న ఒక ప్రదర్శనలో చూసాడు సూర్య ఆమెని. చూపులు కలసినవి. ఆ శుభవేళ మాంగల్యధారణకి దారితీసింది. అంతవరకూ మందాకినిని ప్రతి ప్రదర్శనకీ వెళ్ళే సూర్య పెళ్ళయ్యాక వెళ్ళడం మానేశాడు. ఏదో ఒక సాకు చెప్పేవాడు. ఒకసారి మందాకిని గట్టిగా అడిగితే నువ్వు నాట్యం మానేస్తే బాగుంటుంది ఇకపైన. ఈ పాటికి నీ సరదా తీరి పోయుంటుందిగా" అన్నాడు.

మందాకినికి షాక్ కొట్టింది. మాట్లాడుతున్నది సూర్యేనా అనే అనుమానం కూడా వచ్చింది. "సూర్యా నేను నాట్యాన్ని సరదాగా తీసుకోలేదు. సీరియస్‌గానే తీసుకున్నాను. ఈ సాధనలో అర్థాన్నీ పరమార్థాన్నీ గ్రహించి పరిపూర్ణత్వాన్ని సాధించాలనుకున్నాను. అందుకు మీ ప్రోత్సాహం చేయూతా లభిస్తాయనుకున్నాను. నాట్యరాణిగా ఉన్నత శిఖరాల నధిరోహించాలను కున్నాను. ఒక మంచి కలాకారిణిగా గుర్తింపు పొందాలనుకున్నాను. కానీ మీరు ఇలా మాట్లాడుతున్నా రేమిటి?" ఆశ్చర్యంగా అడిగింది మందాకిని.

"మందాకినీ అవన్నీ చెయ్యాలనుకున్నవాళ్ళు పెళ్ళి చేసుకోకుండా అవివాహితలుగానే వుండిపోవాలి!"

"పెళ్ళినాటి ప్రమాణాలేమయ్యాయి! ఆ వాగ్దానా లెక్కడికి పోయాయ్! మాట తప్పడం ధర్మమా!" జాలిగా అడిగింది.

"మాట నిలబెట్టుకోవడానికి ఇన్నాళ్ళు ఊర్కున్నాను. పిల్లలు పుట్టినా నాట్యం మీద నీ మక్కువ పోలేదు. నా స్నేహితులు నువ్వు ప్రతిరోజూ రిహార్సలూ, ప్రోగ్రామూ అని పోతూవుంటే నన్నుచూసి నవ్వుతున్నారు." సూర్య మాటల్ని ఇక వినలేకపోయింది. స్పృహ తప్పి పడిపోయింది మందాకిని. ఆ తరువాత ఆమె మామూలు మనిషి కావడానికి, మంచం దిగడానికి ఆరునెలలు పట్టింది. ఉత్సాహం ఇంకిపోయి జీవచ్ఛవంలా అయిపోయింది మందాకిని.

అనుకోని పరిస్థితిలో ఇరుక్కుని ఉద్యోగానికి ఉద్వాసన చెప్పాడు సూర్య. పిల్లల చదువు, ఇంట్లో ఖర్చులు బాధ్యత పెరిగింది. అప్పులు ఊరు నిండిపోయాయి. "మందాకిని నువ్వు డాన్సు స్కూలు పెట్టకూడదూ!" అన్నాడు సూర్య.

"అప్పుడు మాత్రం రిహార్సల్సూ స్టూడెంట్ల ప్రోగ్రాం వుండవా ఏమిటి! మీ స్నేహితులే మనుకుంటారు?" అని నిలదీసి అడగాలనిపించినా అడగలేకపోయింది. గజ్జెల గలగల ఆమె కొత్త ఊపిరి పోసింది. ఎంతో శ్రద్ధతో తన శిష్యులకి నాట్యాన్ని నేర్పిస్తూ వారిలో తనని చూసుకుంటూ అమితానందాన్ని పొందుతోంది.

"మందాకినీ నృత్యాలయా" నికి సూర్య మేనేజర్. డబ్బు వ్యవహారాలన్నీ ఆయనే చూసుకుంటూట్టు. మందాకిని వంతు నాట్యం నేర్పించడమేట!"

'ఒక్కొక్క విద్యార్థినీ చూస్తూ వుంటే నేనే అన్ని రూపాల్లో వున్న అనుభూతి నన్ను ఆనందంలో ముంచేస్తోంది భావన. ఆ అందెల గలగలలు నా చెవులలో రింగుమంటూ వుంటే నా హృదయం స్పందించి ఉప్పొంగిపోయి మబ్బుల్లో తేలిపోతోంది నా మనస్సు. అన్నీ మర్చిపోయి ఊహాలోకాల్లో విహరిస్తుంటాను. ఆ సుందర రసమనోజ్ఞ సమయంలో ఈ రోజు నువ్వు జ్ఞాపకం వచ్చావు. ఎన్నాళ్ళనుంచో నా గుండెల్లో దాచుకుంటున్న భారాన్ని నీకు వినిపించాలనుకున్నాను. ఇంత పిచ్చేమిటే! నాట్యం అంటే అని అడిగావు జ్ఞాపకం వుందా! నిజంగా అది పిచ్చేనే. సూర్య నాట్యాన్ని మానెయ్యమని అన్నప్పుడు నిజంగా పిచ్చిదాన్నే అయిపోయాను. మళ్ళీ ఈ నాట్యాలయం స్థాపించాక మనిషిని అయ్యాను భావనా! ఆడవాళ్ళకి కోరికలుండడం ఒక శాపం! అవి తీరకపోవడం పాపం! ఎంత నేర్చినా ఎంత చదివినా ఆడది ఈ నాటికీ పురుషాధీనమే! సమాజం, పరువు, ప్రతిష్ఠ ఇవన్నీ కలబోసి కట్టిన తాడే మాంగల్యమేమో! అది ఆడదాని మెళ్లో కట్టి ఆడుకుంటున్నాడు మొగాడు! ఇలా రాస్తున్నానని బాధపడకు! అదీ ఉత్తరం. చదివి నిట్టూర్చింది భావన. భావిలోనైనా మంచికాలం వస్తుందేమోనని ఆశిస్తూ ఉత్తరాన్ని మడిచి పక్కన పెట్టింది. ★